నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: హెచ్ఎండీ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడనుందని బాచుపలి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు క్రాంతినగర్‌కాలనీ, ఆర్టీసీకాలనీ, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి మల్లంపేట్ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: విద్యార్థులు కష్టపడి చదువుకొని బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని కార్పొరేటర్ జగన్ అన్నారు. మైసమ్మనగర్ ప్రభుత్వ పాఠశాలలో పేబ్యాక్ అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కుమార్, వీరయ్య, ప్రసాద్, శ్యామ్, దాసు, డివిజన్ అధ్యక్షులు, రుద్ర అశోక్, మిట్టల్ ముదిరాజ్, నరసింహారెడ్డి, హనుమంతు, బ్రహ్మానందంచారి, యాదగిరి, సత్తిరెడ్డి, సంతోష్‌కుమార్, మనోహర్, అప్పిరెడ్డి, ఆదిలక్ష్మి, సంధ్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పీర్ల పండుగ సమైక్య ఉత్సవం



సవార్లు ఎత్తుకున్న గూడ ఐలయ్యగౌడ్

జగద్గిరిగుట్ట: మొహరం (పీర్ల పండుగ) సమైక్యంగా జరుపుకునే గొప్ప ఉత్సవమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ అన్నారు. మొహరం ఉత్సవంలో భాగంగా శుక్రవారం జగద్గిరిగుట్టలో కుటుంబ సమేతంగా పాల్గొని సవార్లు ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీర్ల పండుగను హిందూ, ముస్లింలు సంయుక్తంగా జరుపుకుంటారని అన్నారు. విభిన్న మతాలు, సంస్కృతి ఉన్న ఐక్యంగా పండగ జరుపుకోవడం భారతదేశం గొప్పతనమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, ఇమామ్, ఖాజమియా తదితరులు పాల్గొన్నారు.

సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య వినయ్‌కు శుభాకాంక్షలు



చైర్మన్‌ను సత్కరిస్తున్న పుప్పాల భాస్కర్

కుత్బుల్లాపూర్: తెలంగాణ సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా నియమితులైన అలేఖ్య వినయ్‌ను శుక్రవారం షాపూర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంప్రదాయ కళలకు దేశ వ్యాప్తంగా గుర్తింపు లభించేలా కృషి చేయాలని కోరారు. ప్రముఖ వైద్యుడు వినయ్‌కుమార్, మనోజ్, చెన్నయ్య ఆమెను కలిశారు.


వన మహోత్సవం



వీడీఆర్ కాలనీలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్

సుభాష్‌నగర్: మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని సుభాష్‌నగర్ కార్పొరేటర్ హేమలతరెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం సూరారం కాలనీ, వీడీఆర్ కాలనీల్లో స్థానికులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివాజీ, అనిత, సత్యవాణి, మంగ, పద్మావతి, అంజయ్య, నరేందర్‌రెడ్డి, స్థానికులు భరత్, ప్రభాకర్, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతల్ ఏబీవీపీ నూతన కమిటీ



చింతల్: విద్యార్థుల సమస్యలపై పోరాడేందుకు ఏబీవీపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని జిల్లా కన్వీనర్ నాగేష్ అన్నారు. శుక్రవారం చింతల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. 'నేషన్ ఫస్ట్.. సెల్ఫ్ నెక్స్ట్'అనే భావనతో ముందుకు సాగుతున్నామని అన్నారు. విద్యార్థి పరిషద్ కు ఎంతో మంది కార్యకర్తలను జోడిస్తూ ఎన్నో విద్యార్థుల సమస్యలు పై ఉద్యమాలు ధర్నాలు, సమస్యలపై పోరాలు చేస్తూ ఉంటారని అన్నారు. అనంతరం చింతల్ నగర అధ్యక్షుడిగా మనోహర్, చింతల్ నగర కార్యదర్శిగా జగదీష్‌ను ఎన్నుకున్నారు.

యువకుడి అదృశ్యం



బాలశ్రీనాథ్ (ఫైల్)

జగద్గిరిగుట్ట: ఉద్యోగానికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట ఆర్‌పీకాలనీకి చెందిన బాలకృష్ణ కుమారుడు బాలశ్రీనాథ్(24) ఈనెల 10వ తేదీన ఉదయం 8గంటల సమయంలో డ్యూటీకి వెళ్లిన అతడు ఎంతకీ తిరిగి రాలేదు. బంధువులు వద్ద ఆరా తీశారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చెరువు స్థలంలో రంగులు స్ప్రే చేస్తూ..



స్యాండ్ బ్లాస్టింగ్ చేస్తూ..

చెరువునే అద్దెకిచ్చేశారు.!

స్యాండ్ బ్లాస్టింగ్, రసాయన రంగులు వేసే పరిశ్రమలు

- నెలకు రూ.2లక్షలకు పైగా వసూళ్లు
- రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న వైనం
- కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఫాక్స్‌సాగర్



చెరువు స్థలంలో కొనసాగుతున్న పనులు

జీడిమెట్ల: ఫాక్స్‌సాగర్ చెరువు స్థలమే పరిశ్రమ.. చెరువు స్థలానికే లక్షల రూపాయల కిరాయి.. మరి చెరువు స్థలాన్ని కిరాయికి ఇచ్చింది ఎవరు? చెరువు జాగాకు అద్దె చెల్లిస్తున్నది ఎవరు? చెరువు స్థలంలో బహిరంగంగానే పనులు జరుగుతున్నా చెరువును కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు ఎక్కడ పోయారు? ఎవరి సొత్తు ఎవరికి సొమ్ము చెల్లిస్తున్నారు? ఇది వినడడానికి బాగానే ఉంది సీన్‌లోకి వెళ్లి చూస్తే క్లియర్‌గా చెరువు స్థలంలో బరాబర్ పరిశ్రమ పనులు నడుస్తున్నాయి.

20ఏళ్లుగా రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్నాం.. ఏం చేసుకుంటారో చేసుకోండి!

సదరు చెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో పరిశ్రమల పనులు వాయు, నీటి కాలుష్యంతో జరుపుతున్నారన్న సమాచారంతో అక్రమదందా ఫొటోలను 'సాక్షి'ప్రతినిధి తీసి సదరు పరిశ్రమ సిబ్బందిని ప్రశ్నించగా అక్కడి అకౌంటెంట్ గడిచిన 20ఏళ్లుగా అధికారులతో పాటు ఆ స్థలానికి ఓ వ్యక్తికి రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్నామంటూ మీరు ఏం చేసుకుంటారో చేసుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు.

అభివృద్ధి పేరుతో ఎఫ్‌టీఎల్‌లోనే మట్టిరోడ్డు..

ఇదే చెరువుకు సంబంధించి రెండు సంవత్సరాల క్రితం ఇరిగేషన్ అధికారులు ఫాక్స్‌సాగర్ అభివృద్ధి పేరుతో చుట్టూ ఎఫ్‌టీఎల్‌లోనే మట్టిరోడ్డును వేసి ఈ అక్రమ దందాకు అధికారులే తెరలేపారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా ఎఫ్‌టీఎల్‌లో స్యాండ్ బ్లాస్టింగ్‌కు కావాలనే ఇరిగేషన్ అధికారులు తెరలేపారని పేర్కొంటున్నారు. దీని సాకుతో లక్షల రూపాయల వసూళ్లు చేపడుతూ ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని తెలిపారు.

ఎకరాల్లో స్థలాన్ని అక్రమిస్తూ.. చెరువును కాలుష్యం చేస్తూ.!

సదరు స్యాండ్ బ్లాస్టింగ్ పరిశ్రమ యాజమాన్యం ఏకంగా చెరువులో ఉన్న చెట్లను తొలగిస్తూ కొంచెం కొంచెంగా స్థలాన్ని అక్రమిస్తూ పనులను విస్తరిస్తున్నారు. స్యాండ్ బ్లాస్టింగ్, రంగులు వేసే క్రమంలో నిబంధనల ప్రకారం.. ప్రతి పరిశ్రమ ఏదైనా షెడ్డులో నిర్వహించాలి కాని ఇక్కడ మాత్రం బహిరంగంగా చెరువులో స్యాండ్ బ్లాస్టింగ్, స్ప్రే యంత్రంతో రంగులు వేస్తూ పర్యావరణాన్ని కాలుష్యం చేస్తున్నారు.

ఇరిగేషన్ ఈఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం..

ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు స్థానికులు పర్యావరణ పరిరక్షకులు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోవడం లేదు. దీంతో అధికారులే అన్నీ తామై వ్యవహరిస్తున్నట్లు వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకపోతే ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని ప్రజలు అంటున్నారు. ఏది ఏమైనా ఫాక్స్‌సాగర్ చెరువు స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి



కేంద్ర మంత్రులకు పూల మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: హెచ్ఎంటీ కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం చింతల్ హెచ్ఎంటీ పరిశ్రమను కేంద్ర భారీ పరిశ్రమలు, స్టీల్ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎంటీ కార్మిక సంఘ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఎమ్మెల్యే వివేకానంద్ కార్మికుల సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. 1992 నుంచి ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలును విడుదల చేయాలని, పీఎఫ్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్‌లను వెంటనే చెల్లించాలని కోరారు.

◆ అదే విధంగా 2019 నుంచి ఉద్యోగులకు అందాల్సిన గ్రాట్యుటీ ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. దీంతో రిటైర్మెంట్ సమయంలో దాదాపు 600 మంది ఉద్యోగులు తమకు అందాల్సిన బకాయిలు అందగా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పలువురు ఉద్యోగులు మృతి చెందగా వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని వివరించారు. దీనిపై కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సానుకూలంగా స్పందించారు. హెచ్ఎంటీ సీఎండీ రాజేష్ కోహ్లీ, వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్, హెచ్ఎంటీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



సుభాష్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ అబ్దుల్ కలామ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కుత్బుల్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో క్లోవ్ డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో దంత పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు భరధ్వాజ, అసిస్టెంట్ సుధాకర్‌లు 150మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంత సమస్యలతో బాధ పడుతున్న విద్యార్థులకు మందులు అందజేశారు. రెండు పూటలా ఆహారం తీసుకున్న తరువాత దంతాలను శుభ్రం చేసుకుంటే దంత సమస్యలు తలెత్తవని తెలిపారు. ఈ శిబిరంలో అబ్దుల్ కలామ్ శాఖ కార్యదర్శి కోల రవీందర్ ముదిరాజ్, ప్రధానోపాధ్యాయులు కమల్ సింగ్, స్థానికుడు రాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి



కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే, మేయర్

నిజాంపేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 25వ సాధారణ సర్వసభ్య సమావేశం మేయర్ కొలను నీలా గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. కార్పొరేషన్‌లోని 33 డివిజన్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కార్పొరేటర్లు కృషి చేయాలని సూచించారు. వర్షాకాలం కావడంతో ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించాలన్నారు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

◆ ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ.. మంజీరా పైపులైన్ల పనులు అవసరమైన ప్రాంతాల్లో మంజూరు చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. అదే విధంగా బస్తీల్లో, కాలనీల్లో, ప్రధాన రోడ్ల మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని మరి కొందరు కార్పొరేటర్లు సమావేశంలో లేవనెత్తారు.

◆ అదే విధంగా బోనాల ఉత్సవాలకు అన్ని దేవాలాయల్లో ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అవసరమైన అభివృద్ధి పనులకు సంబంధించిన పనులను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, కమిషనర్ రామకృష్ణారావు, తహసీల్దార్ పూల్‌సింగ్, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు ఈ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు పుస్తెలతాడు అప్పగింత

జగద్గిరిగుట్ట: ఓ మహిళ పొగొట్టుకున బంగారు పుస్తెల తాడును 2గంటల వ్యవధిలోనే జగద్గిరిగుట్ట పోలీసులు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైసమ్మనగర్ రోడ్ నం.7కు చెందిన శ్యామల శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో తన బంగారు పుస్తెల తాడును పోగొట్టుకుంది. ఈ విషయాన్ని జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్ అంజిబాబు సీసీ ఫుటేజీలను పరిశీలించి మహిళ పుస్తెల తాడును కనుగొని ఆమెకు అప్పగించారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్

అప్రెంటిస్ మేళాలో ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న విద్యార్థిని

కుత్బుల్లాపూర్: నైపుణ్యాలు పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బహదూర్‌పల్లి చౌరస్తాలోని కేఎం పాండు ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన అప్రెంటిస్ మేళాను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో 30కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 250 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 120 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో వృత్తి విద్యా కోర్సులకు ఎంతో ఆదరణ ఉందన్నారు. విద్యార్థులు చదువులో ఇతరులతో పోటీపడుతూ నైపుణ్యతను పెంపొందించుకున్నప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కుత్బుల్లాపూర్‌లో ఇప్పటికే జూనియర్ కళాశాల, ఒకేషనల్ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే స్థలాన్ని పరిశీలించామని కళాశాల పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం జాబ్‌మేళా ఉండేలా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జయప్రద బాయి, జ్యోత్స్నరాణి, ప్రిన్సిపల్స్ మైమూన్, తిరుపతయ్య, స్కిల్ డెవలప్మెంట్ రీజినల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాడతాం

కుత్బుల్లాపూర్: కార్మికుల న్యాయబద్ధమైన హక్కులను సాధించేందుకు పరిశ్రమల యాజమాన్యాలతో ఎంత వరకైనా పోరాడుతానని ఐఎన్‌టీయూసీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. బాలానగర్‌లోని బయో కెమికల్స్ అండ్ సింథటిక్ ప్రొడక్ట్స్ పరిశ్రమ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నేపథ్యంలో శుక్రవారం షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో మదన్‌గౌడ్ పరిశ్రమ నూతన కార్యవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా సుభాష్, సుమిత్‌సింగ్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవీందర్‌రెడ్డి, చీఫ్ వైస్ ప్రెసిడెంట్లుగా శ్రీనివాస్, నవీన్‌కుమార్, అజార్‌పాషా, వైస్ ప్రెసిడెంట్లుగా బాలరాజు, చంద్రశేఖర్, నరేందర్, ప్రశాంత్‌రెడ్డి, శివగురు, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా యాదగిరి, మధు, శ్రీనివాస్, రామ్మోహన్, రమేష్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ.. నూతన కార్యవర్గ సభ్యులు పరిశ్రమలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు.

డిజిగ్నేషన్.. రిజిగ్నేషన్.!

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీలో భగ్గుమన్న అంతర్గత విభేదాలు

- కార్పొరేషన్‌లో ముగ్గురు అధ్యక్షుల నియామకంతో చెలరేగిన మంటలు
- స్థానిక కమిటీకి తెలపకుండా నియమించిన జిల్లా సీనియర్ నేతలు
- తీవ్ర మనస్థాపానికి గురై పదవులకు రాజీనామా చేసిన నాయకులు
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీలో మూకుమ్మడి రాజీనామాల వ్యవహారం ఆ పార్టీలో పెద్ద దుమారమే లేపింది. నిన్నటి దాకా నిజాంపేట్ కార్పొరేషన్‌కు అధ్యక్షుడిగా ఉన్న ఆకుల సతీష్ అలుపెరగని పోరాటమే చేశారని చెప్పవచ్చు. గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం చేయలేని విధంగా నాటి అధికార బీఆర్ఎస్ పార్టీపై పోరాడారు. ఇలా నిజాంపేట్ కార్పొరేషన్‌లో అంతంతా మాత్రంగా ఉన్న బీజేపీకి మంచి పట్టు తీసుకొచ్చేందుకు తీవ్రంగానే కృషి చేశారు. రాత్రికి రాత్రే ఏమైందో ఏమో నిజాంపేట్ కార్పొరేషన్‌ను ముడూ ముక్కలుగా విభజించి ముగ్గురు అధ్యక్షులను నియమించారు. దీంతో ఒక్కసారిగా బీజేపీలో అంతర్గతంగా ఉన్న విభేదాలు భగ్గుమన్నాయి. ఈ సంఘటనతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆకుల సతీష్ ఆయనతో పాటు వివిధ విభాగాల నాయకులు పార్టీ పదవులకు శుక్రవారం రాజీనామా చేశారు.

ఇతర పార్టీ నాయకులకు లబ్ధి చేకూర్చే విధంగా..

ప్రగతినగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆకుల సతీష్ మాట్లాడుతూ... పార్టీ ఎదుగుదలను ఓర్వలేని రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయి బాధ్యతల్లో ఉన్న నేతలే కలహాలకు కారణమవుతున్నారని అన్నారు. ఇతర పార్టీ నాయకులకు లబ్ధి చేకూర్చే విధంగా చేశారని ఆరోపించారు. పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా పని చేస్తున్న కొందరు సీనియర్ నేతలపై రాష్ట్ర, కేంద్ర నాయకత్వం దృష్టి సారించాలని కోరారు. పదవి ఉన్నా.. లేకున్నా.. తాము చేసే పోరాటంలో ఏ మాత్రం మార్పు ఉండదని స్పష్టం చేశారు.

పదవులకు రాజీనామా చేసింది వీరే...

గొల్ల కృష్ణ, అమలేశ్వరీ, కాశీ, అరుణ్‌రావు, శ్రీనవాస్‌రావు, విజయ్‌కుమార్, రాము, కవితారెడ్డి, ముఖేశ్, కుమార్‌గౌడ్, ఈశ్వర్‌రెడ్డి, సతీష్‌కృష్ణ, పట్నాయక్, మాధవరావు, ప్రదీప్‌కుమార్, ఎల్లస్వామి, శ్రీనివాస్ తదితరులు పార్టీలోని తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ రాజీనామాలను అధిష్టానం ఆమోదిస్తుందా? లేక బుజ్జగిస్తుందా? అనేది వేచి చూడాలి.

ఆకుల సతీష్‌కు చెక్ పెట్టేందుకేనా..?

ఆకుల సతీష్‌కు చెక్ పెట్టేందుకే ఆ పార్టీ నాయకులు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ముగ్గురు అధ్యక్షులను నియమించారని తెలుస్తోంది. సతీష్‌ను ఇంతలా టార్గెట్ చేయడంలో ఆంతర్యమేమిటి.? ఓ స్థానిక నాయకుడిపై ఇంతలా ఫోకస్ పెట్టడంపై అటు బీజేపీలోనూ, ఇటు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లోనూ జోరుగా చర్చ జరుగుతోంది. అభివృద్ధి పనుల్లో జరిగే అవకతవకలపై అధికారులను సతీష్ పూర్తి ఆధారాలతో ముచ్చెమటలు పట్టించిన విషయం తెలిసిందే. అదే విధంగా అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై అలుపెరగని పోరాటామే చేశారని స్థానికులు, కార్యకర్తలు చెబుతున్నారు. ఈ క్రమంలో సొంత పార్టీ నేతల నుంచి సైతం ఒత్తిళ్లు వచ్చినా వెనక్కు తగ్గలేదు. ఓ ప్రైవేటు కాలేజీ యాజమాన్యం ప్రభుత్వ స్థలం కబ్జా చేసిందనే ఫిర్యాదుపై ఏకంగా ఓ తెలుగు సినీ దిగ్గజ నిర్మాత సతీష్‌ను కలిసేందుకు ప్రయత్నించడం విశేషం.



పదవులకు రాజీనామా చేసిన నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు